కథ

# ప్రేమలేఖ

ఎవర్రా శారబ్బా నాకీ లేఖని ఆశ్చర్య పోతున్నావు కదూ! చదువు నీకే అర్థమవుతుంది.

అతి త్వరలో నా దానివి కాబోయే నీకు! ఈనా సంభోదన చదవగానే నీకు నాపై బోలెడంత కోపం వస్తుందని నాకు తెలుసులే.

ఏంటీ నీ మనసులో ఈ కలవరపాటేంది? నునులేత బెండకాయలాంటి అతి సుకుమారమైన నీ చేతివేళ్ళెందుకలా చిగురుటాకుల్లా వణుకు తున్నాయి.

'నా దానివి కాబోయే నీకు' అని ఈ ప్రేమలేఖ రాసిన సాహసగాడెవడని భయము, ఆశ్చర్యము, ఆనందము కలగలిసిన ఫలితమే కదా ఈ తత్తరపాటు. అయినా నీకు రాయబారాలు, ప్రేమలేఖలు, ప్రేమ సందేశాలు పంపే సాహసం ఎవరికుంటుందే నాకు తప్ప.

ప్రేమ, దోమ, గీమ వగైరా ఏ ప్రకంపనాలు లేని నీ నిశ్చల మానస సరోవరములోనికి ఎవరూ లేని నీ హృదయాంతరాళంలోకి చొచ్చుకొని పోయి, వేవేల ప్రేమ తరంగాలను రేపి నీ దొరవలపును దోచుకునే నేపథ్యంలో అహర్నిశలు విఫల యత్నాలతో పరిశ్రమిస్తున్న నీప్రేమ పిపాసినైన నేనే, నీ అవినాష్‌నే ఈ ప్రేమలేఖ రాస్తున్నాను.

అదిగో ఆ చిరుకోపమే వద్దంటాను. ఆ కోపాన్ని తాపంగా మార్చుకొని చూడు. జీవిత మధ్బుతానందానుభూతుల సమ్మేళనమని నీకే అర్థమవుతాది.

సరిగా ఈ పాయింట్ దగ్గరే నీకు నాకు చుక్కెదురు. జీవితం జీవించడానికి నీవంటావు. జీవితం అనుభవంచడానికని నేనంటాను. ఈ విషయం మీద నీవో అవగాహనకొస్తే నీ, నా అద్భుత మధురానుభూతుల జీవితాల్ని చెరిసగం పంచుకుందా మని నేను ఆశపడడంలో తప్పేం లేదులే. ఈ విషయంలో నీవు నాకు సహకరించడంలో కూడా తప్పేంలేదులే. అవును మరి ఉప్పుకారాలు తినే ఈ దేహానికి ఆ మాత్రం తాపాలు, పరితాపాలు లేకుంటే వృధాయే సుమా!

నేనేదో నీతో దాచిపెట్టి, నిన్ను మభ్యపెట్టి నిన్ను వంచించడం లేదు. నాకు చేతకాని పనుల్లో మోసం చేయకపోవడం ఒకటి.

గ్రీకు వీరునిలాగా పెళ్ళికాని రాకుమారుడి లాగా నిత్యం నూతనోత్సాహముతో నవ్వుతూ, నవ్విస్తూ కళకళాడుతుంటే నన్ను చూసి, నాకు పెళ్ళయిందనిగాని, నాకో పెళ్ళాం వుందనిగాని, ఆ పెళ్ళాం నాకో ఇద్దరు సుపుత్రుల్ని ప్రసాదించిందని గాని ఎవ్వరూ అనుకోరు. అలా అనుకోరని నేనేనాడు దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. చేయను కూడా. అపద్దాలాడడం కూడా నాకు చేత కావడం లేదు. మన తొలి పరిచయంలో నేను మా ఆవిడ మీద జోకులు వేసి నీకు నేను కొన్ని నవ్వుల పువుల్ని కానుకగా సమర్పించుకున్న సంగతి మర్చిపోకే.

శశీ! నీకీ విషయాలన్ని ఎందుకు చెబుతున్నా నంటే నీవు రోజు ఇష్టంగా నీ సిగలోకి తురుముకొనే తెల్లని మల్లెవంటిదే నా మనస్సని నీవు గ్రహించ దానికి.

సంగిపాగి ఆనందరాజు

శశీ నీకింకో విషయం చెప్పనా? శశీ అంటే పరిచయమయినప్పట్నుంచి నాన్న టీషర్టులు, జీన్సు ప్యాంట్లు వేసుకొని తెగ మురిసిపోతాడని మా సుపుత్రులిద్దరూ వాళ్ళమ్మ దగ్గర జోకులు పేల్చే స్తుంటారు.

మా ఆవిడ కూడా చాలా జోవియల్‌గా వుంటుంది. ఆఫ్‌కోర్స్ అప్పుడప్పుడు అలకపాన్పు ఎక్కుతుందనుకోండి. అలా అలక పాన్పు ఎక్కడం వెనుకదాగివున్న రసమాధుర్యపు రహస్యమేమిటో ఆవిడకు, నాకే తెలుసు. ఆఫ్‌కోర్స్ ముందు ముందు మీకు కూడా తెలుస్తుందిలే. శశీ! నీ అందచందాల మీద ఒట్టు. వున్నట్టుండి అలుకలన్నీ ఇట్టె మాయ మవుతాయి. చిటికేసి మంత్రమేసినట్లు అహ్లాదకరమైన మధుర రసమాధుర్యపు వాతావరణానికి నాంది పలుకుతుంది. మానసికంగా శారీరకంగా అలా అలా గాలిలో విహరించి స్వర్గపుటంచుల్ని స్పృశిస్తాము. ఏంటీ డౌటా కావాలంటే ప్రాక్టికల్స్ మొదలెట్టుదాం. నీవు కూడా ఎంత కాలమని ఇలా ఒంటరిగా వుంటావు. ఏదో ఒక కోణం దగ్గర జీవితంలో రాజీ పడక తప్పదు సుమా!

శశీ! నాకు తెలియక అడుగుతాను ఇలా ఎంతకాలమని ఒంటరి జీవితాన్ని జీవిస్తావు? ఇలా ఎంతకాలమని కోర్కెలతో తపించే దేహాన్ని, మనసును బుజ్జగిస్తావు? అసలు నీకు జీవితమంటే ఏమిటో తెలుసా?

జీవితమంటే జంటని ప్రస్తుతం మన మధ్యనున్న సమయ సందర్భాన్ని బట్టి నిర్వచిస్తాను. ఆఫ్‌కోర్స్ ఈ నా డెఫినేషతో ఎవ్వరూ అంగీకరించరు. ఎందుకంటే సృష్టిలో జీవులన్నీ జంటగానే జీవిస్తాయి. ఇది చాలా సాధారణమైన విషయం. అందుకనే నా నిర్వచనాన్ని ఎవ్వరూ అంగీకరించకపోవచ్చు.

నా దృష్టిలో జీవులు జంటలుగా ఏర్పడడ మనేది ఎంత సాధారణ విషయమో అంత విచిత్రమైన విషయం కూడా. ఎందుకంటే జీవితంలో ఎంతో మంది తారసపడుతుంటారు. కాని మనసనేది ఎవరో ఒకర్ని చూచినప్పుడు మాత్రమే స్పందిస్తుంది. నీ తొలి దర్శన భాగ్యం కూడా అలాంటి స్పందననే నాలో

కలిగించింది. ఒక వింతైన అనుభూతిని కలిగించింది. నాకు తెలియకుండానే నా మనసు నీ వశమయినది.

స్త్రీ, పురుషుల మధ్య జంట జీవితాలు లేకపోతే పునరుత్పత్తికి అవకాశముండేదే కాదు. నీవు ఒంటరి జీవితాన్ని జీవిస్తూ సృష్టి ధర్మానికి విఘాతం కలిగించవద్దు.

ఈ ప్రేమలేఖను ఎక్కడో ప్రారంభించి ఎక్కడికెక్కడికో తీసుకుపోయాను కదూ! సారీ చెప్పాలని వుందిరా. అయినా ప్రేమలో సారీలు పనికిరావు. సరే అసలు విషయానికి వద్దాం. ఇప్పుడు నీకు రమారమి ముప్పై అయిదేళ్ళు పైబడే వుంటాయి. ఇంత సుదీర్ఘమైన జీవితంలో రసభరిత పర్వాలు లేవు నైరాశ్యపు ఛాయలు తప్ప. మధురమైన రాత్రులు లేవు నిదురరాని రాత్రులు తప్ప. సరసపు సన్నివేశాలు లేవు. శృంగార ఘట్టాలు లేవు. రసానుభూతి సంఘట్టనాలు లేవు. మర్చిపోలేని మధురానుభూతుల మైలురాళ్ళు లేవు. బతుకు నిస్సారంగా వుంటే జీవితానికి సార్థకత వుండదు ప్రియా!

ఎప్పుడైనా గట్టిగా అడిగితే ఏదైనా మంచి సంబంధం కుదిరితే చేసుకుంటానంటావు. ఎప్పుడే నీకు మంచి సంబంధం కుదిరేది? వృద్ధాప్య ఛాయలు దేహాన్ని ఆవరించిన తర్వాతనా?

మంచి సంబంధం అంటే నీ దృష్టిలో ఏమిటే అనడిగితే మంచి పొజిషనలో వుండేవాడంటావు. మంచి పోజిషనంటే ఆర్థిక స్థోమతనే కదా అందరు అర్థం చేసుకునేది, అందరూ అనుకునేది. దేశంలో ఆర్థికస్థోమత కలిగిన వారికేమీ కొదువ లేదు. మరి అలాంటప్పుడు నీకెందుకు సంబంధం వచ్చి చావదంటే నా ఫ్యామిలి బ్యాక్‌గ్రౌండ్ అంటావు.

బల్లి గోడను అంటిపెట్టుకున్నట్లు మంచానికి అంటిపెట్టుకున్న ముసలి తల్లిదండ్రులు, పక్షపాతంతో కాళ్ళు చేతులు నచ్చుబడిపోయిన చిన్నాన్న. పోలియోతో అవిటిదైన చెల్లెలు. మా ఫ్యామిలీకంతా నేను పెద్దదిక్కుని. జీవితాంతము వారి బరువు బాధ్యతలు నేనే భరించాలి.

ఈ షరత్తుతోనే సంబంధాలన్ని బెడిసి కొట్టుతాయంటావు.

ప్రియా! ఉద్యోగం సద్యోగంతో పాటు మంచి ఆర్థికస్థోమత కలిగిన వానికోసం నిరీక్షించడం కంటే నిన్ను, నీ ఫ్యామిలి బ్యాక్‌గ్రౌండ్‌ని అర్థం చేసుకోగలిగే మంచి గుణగణాలున్న వ్యక్తి కోసం అన్వేషిస్తే నీ వరుడుగా నవమన్మథుడిగా నీ కళ్ళెదుటే నేను ప్రత్యక్షం కాలేనా?

వెధవ బరితెగించాడని అనుకుంటున్నావు కదూ! నేనలాంటి వ్యక్తిని కాదులే శశీ! ఇలాంటి ప్రేమలేఖలు రాసే వ్యక్తుల పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి రాశాను. ఈలాంటి మనస్తత్వం గల మగమహారాజులు సమాజంలో ఎందరో వుంటారు. నీపై ఆ దుష్టుల చూపు పడకూడదని నా అభిప్రాయం. ఈ నా లేఖ చూసైనా సరే మొన్న వచ్చిన సంబంధానికి పచ్చజెండా వూపేయ్.

శశీ! నీవో ఇల్లాలివైతే నాకంటే సంతోషించే వ్యక్తి మరెవ్వరూ వుండరు.

# ప్రతీకలు

– ఉద్దంటి రామమోహనరావు

ప్రతీకలకేం తక్కువ?!
ప్రకృతిలోనే కాదు
ఇంట్లో ఒంట్లో వీధిలో
ఎక్కడైనా దొరుకుతాయి.

పరుగులెత్తే జీవితానికి
రెగ్యులేటరు చెడిపోయిన ఫ్యానో
ముగ్గులేని వాకిలో వాడొచ్చు.

కనికరంలేని మూడీ బాస్‌కు
ఎప్పుడెలా వెలుగుతుందో
తెలియని స్ట్రీట్‌లైట్‌నీ

శాడిస్ట్ భర్త వేధింపులకు
ప్రభుత్వాసుపత్రి ట్రీట్‌మెంట్‌నీ
ఫలించని కష్టానికి
మేకలుతిన్న సన్నజాజి పందిర్నీ
కలిసొచ్చిన అదృష్టానికి
మన దొడ్లోకొచ్చిన ప్రక్కింటి
గున్నమామిడి కొమ్మనీ ఎన్నుకోవచ్చు.

పూర్వవైభవానికి
గత దీపావళి తాలూకు తారాజువ్వ
శాపగ్రస్త వృద్ధాప్యానికి
ఊడిపోయిన పాత కిటికీ చువ్వ

ఎండిపోయిన కవిత్వానికి
పోగొట్టుకున్న పెన్ను
తెగిపోయిన స్నేహానికి
ఊడిపోయిన పన్ను.

నిస్సహాయతకు
తొంబై ఏళ్ళ అమ్మని చూడటానికి
తొమ్మిది నిమిషాలైనా
దొరకని దౌర్భాగ్యం
ఆశాభంగానికి
కుప్పకూలిన స్టాకు మార్కెట్టో
వానొచ్చి ఆగిపోయిన క్రికెట్టో చాలు.